జిందగీ
# చిత్రాలు
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 2 జూన్ 2025
www.ntnews.com


## ఏది కోరితే అదే దక్కేది

గీతాసారం

**యాంతి దేవవ్రతా దేవాన్, పిత్రూన్ యాంతి పితృవ్రతాః।**
**భూతాని యాంతి భూతేజ్యా యాంతి మద్యాజినోఽపి మామ్॥**

(భగవద్గీత - 9-25)

దేవతలను పూజించేవారు దేవలోకాలకు, పితృదేవతలను ఆరాధించేవారు పితృలోకాలకు వెళ్తారు. అలాగే భూతప్రేతాలను అర్చించే వారు ఆ రూపాలను పొందుతారు.. కాని, నన్ను ఉపాసించు భక్తులు నన్నే పొందుతారు. అలాంటి భక్తులకు పునర్జన్మ ఉండదు, అంటాడు కృష్ణ పరమాత్మ.

ఒక వ్యక్తి ధారాళంగా గాలి వెలుతురూ వస్తూ ఆహ్లాదకరమైన, మనోరంజకమైన వాతావరణంలో నివసించాలి అనుకుంటే.. దానికి తగిన ప్రదేశాన్ని ఎన్నుకోవాలి. ఎత్తయిన ప్రదేశంలో ఇల్లును నిర్మించుకొని, ఇంటి చుట్టూ తోటలను పెంచుకోవాలి. దుర్వాసనలు రాకుండా పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలి. అంతే కాని అపరిశుభ్ర వాతావరణంలో చెట్లుచేమలు లేకుండా ఇంటిని నిర్మించుకొని సువాసనలు రావాలంటే సాధ్యపడదు. అలాగే మనం దేనిని కోరుకుంటామో దానికి తగిన పరిశ్రమ చేయాలి. మనసులో స్పష్టత ఉండాలి. తీవ్రమైన తపనతో మనసు రగిలిపోవాలి. దానిని సాధించేందుకు నిరంతరం కృషిచేయాలి. మామిడి చెట్టు నాటి అరటికాయలు కోరుకుంటే సాధ్యపడదు. నిజానికి ఉన్నది ఒక్కటే.. పరమాత్మ తత్వం. అయితే ఒక్కొక్కరు ఒక్కొక్క భావనతో దానిని దర్శించి ఉపాసించి ఆ స్థానాన్ని పొందుతారు. అయితే ఎవరు ఏ రూపంలో ఆరాధించినా చేరేది పంచభూతాత్మకమైన పరమాత్మనే.. కాకపోతే భగవంతుడి అంతర్యామిత్వమును దర్శించి సమర్పణ భావనతో ఉపాసించే వారికి పునర్జన్మ ఉండదని భగవానుడు చెబుతున్నాడు.

ఒకదారి మననొక లక్ష్యానికి చేరుస్తుంది. ఎన్నిమార్లు ఆ దారిలో నడిచినా ఆ ఫలితాలే పునరావృతం అవుతాయి. అలవాటైన, సౌకర్యవంతమైన వలయంగా భావించి ఆ దారిని విడవలేనివారు ఆ ఫలితాలే అంతిమమనే భావనకు పరిమితమవుతారు. పరిమితత్వం అపరిమితత్వాన్ని చేరుకోలేదు. కొత్తదారిని అన్వేషించిన వారు కొత్త లక్ష్యాన్ని చేరుకుంటారు. అందులో సమస్యలు ఎదురుకావచ్చు.. అపజయాలు పలకరించవచ్చు. కాని ప్రయత్నలోపం లేకుండా ముందుకు సాగినవారు జీవితంలో ఉన్నతిని సాధిస్తారు. వ్యక్తిగతంగా పరిణతి సాధిస్తే కుటుంబం, తద్వారా సమాజం ఉన్నతి చెందుతుంది.

ప్రతివ్యక్తి జీవితానికీ ఒక ప్రయోజనం ఉంటుంది. ఇష్టాయిష్టాలు ఆ ప్రయోజనానికి అనుబంధంగా పనిచేయాలే కాని, ప్రయోజనం ఇష్టాయిష్టాలను అనుసరించకూడదు. భ్రమరకీట న్యాయాన్ని అనుసరించి వ్యక్తి త్రికరణశుద్ధిగా ఏ ప్రయోజనాన్ని భావనచేస్తూ, ఉపాసిస్తాడో ఆ వ్యక్తి ఆ లక్ష్యాన్ని చేరుకోగలుగుతాడు. ఏర్పరుచుకున్న లక్ష్యంపై దృష్టిని కేంద్రీకరించి అహర్నిశలు అంకితభావంతో ప్రయత్నించడం వల్ల ఆ సంకల్పం సాకారమవుతుంది. నిజానికి మనం చేసే ప్రయత్నమే మన ఫలితాన్ని నిర్ణయిస్తుంది. అయితే మనలో చాలా మంది జరిగిపోయిన దానికి చింతిస్తూనో.. భవితపై ఊహాసౌధాలు నిర్మించుకుంటూనో వర్తమానాన్ని విస్మరిస్తుంటారు. ఎప్పటిదాకా వారు ఆ భావనలకు అతుక్కుపోతారో వారి ఆలోచనా పరిధి దానికి పరిమితం అవుతుంది. సాధారణంగా మనందరం కొంత పనిని చేయగలమని నమ్ముతాం. కాని అవసరమైన సమయంలో దానికి మించి చేయగలుగుతాం. అయితే దాని కన్నా ఎన్నో రెట్ల సామర్థ్యం మనలో ఉన్నదనే సత్యాన్ని విస్మరిస్తాం. పరిమితుల పరిధులను చెరిపివేసుకోగలిగితే అభ్యుదయమనే ఆకాశాన్ని అధిగమించగలం. అలాగే ఇతరులపై విమర్శలు చేయడం, దోషారోపణలు చేయడం, తప్పులెంచడం వల్ల మనసు దానికే పరిమి



తమై ఉన్నతస్థితిని చూడటానికి సన్నద్ధం కాలేదని అర్థం. మనలోకి ఏదీ బాహిరంగా రాదు.. ఏదైనా సరే అంతరంగంలో నుంచి వస్తుంది. దానిని పరిశుద్ధంగా ఉంచుకుంటే పరమాత్మకు ఆవాసం అవుతుంది.

అపరిమితమైన భగవత్తత్వంలో జీవించాల్సిన మనం, పరిమితమైన భౌతిక సుఖాలవైపు ఆకర్షితులం అవుతున్నాం. భౌతికంగా సాధించినది భౌతికానికే పరిమితం.. దానికి అతీతమైన భావనతో జీవించగలిగిన వ్యక్తులు జీవితాన్ని ఆస్వాదించ గలుగుతారు. తాము శాశ్వతమైన భగవత్తత్వానికి ప్రతీకలమనే భావనతో తమ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోగలుగుతారు. భగవంతుడనే అనంతత్వంలో లయమవుతారు.

...✍ పాలకుర్తి రామమూర్తి

## ఎప్పటికీ చెడనిది

వయసుపైబడిన ఒక జమీందారుకు పవిత్ర శివ క్షేత్రమైన రామేశ్వరం చూడాలనిపించింది. ప్రయాణ ఏర్పాట్లు సిద్ధం చేసుకుని బయల్దేరే ముందు తన తల్లి ఆశీర్వాదం కోసం వెళ్లాడు. 'కాశి, రామేశ్వరం చూడాలని ఉన్నా నేను చూడలేకపోయాను. నీకు ఆ అదృష్టం కలిగింది, చాలా సంతోషం. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటిగా ప్రసిద్ధి గాంచిన రామేశ్వరం వెళ్తున్న నీకు ఎప్పటికీ చెడనిది ఏమిటో తెలుస్తుందిలే నాయనా!' అని ఆశీర్వదించి పంపింది.
ప్రయాణంలో జమీందారుకు తన తల్లి చెప్పిన 'ఎప్పటికీ చెడనిది ఏమిటి?' అని ఆలోచనలు మొదలయ్యాయి. ఎంత ఆలోచించినా అతనికి సరైన సమాధానం స్ఫురించలేదు. తనతోపాటు ప్రయాణిస్తున్న వారిని అడిగి చూశాడు. సంతృప్తికరమైన సమాధానమేదీ దొరకలేదు. ఎలాగైతేనేమి రామేశ్వరం చేరాడు. రామనాథ స్వామిని దర్శనం చేసుకున్నాడు. గుడి సమీపంలోని సముద్రం ముందు అలలవైపు చూస్తూ తన తల్లి మాటలను గుర్తు తెచ్చుకుని ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఇసుకలో నడిచి వెళ్తున్న ఓ సాధువు జమీందారును చూసి ఆగాడు. 'దేని గురించి దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?' అని అడిగాడు. తన తల్లి పలికిన మాటలు చెప్పాడు జమీందారు. సాధువు చిన్నగా నవ్వి 'జన్మించిన ప్రతి ఒక్కరూ తమ జీవిత కాలంలో ఎన్నో పనులు చేస్తుంటారు. వీటిలో మంచి చెడు కలిసి ఉంటాయి. అవి మంచైనా, చెడైనా ఆ కర్మఫలాన్ని మాత్రం తప్పకుండా అనుభవించి తీరాల్సిందే. ఇందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఉండదు. దేవుడైనా సరే, మానవ జన్మ స్వీకరించాక కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. ఏ వస్తువైనా, పదార్థమైనా కొన్నాళ్లకు చెడి పోతుందేమో కానీ చేసిన కర్మలు ఎప్పటికీ చెడవు. ఆ కర్మఫలం అనుభవించేంత వరకు అవి మనతోటే ఏమాత్రం చెడకుండా ఉంటాయి' అని సమాధానమిచ్చి వెళ్లిపోయాడు. 'కర్మఫలం అనుభవించక తప్పదని, కష్టనష్టాలకు దేవుడిని నిందించడం మంచిది కాదని' తన తల్లి చెప్పకనే చెప్పిన మాటల అంతరార్థాన్ని జమీందారు తెలుసుకున్నాడు.




...✍ ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821

# ముకుంద ముచుకుందీయం

శుక ఉవాచ– రాజా! ముచుకుందుని మాటలు విని అమోఘ సంకల్పుడు ముకుందుడు మేఘ గంభీరమైన గాత్రంతో ఇలా పలికాడు. 'క్షాత్రవంతా! నా జన్మ కర్మ గుణ గోత్ర నామాల గురించి చెప్పమన్నావు. భూరేణువులనైనా లెక్కింప వచ్చునేమో గాని, వానిని గణించి వక్కాణించడం ఎల్లలోకాలకు వల్లభుడ– ఏలికనైన నా వల్ల కూడా కాదు. విరించి వరించగా కనికరించి భూ భారాన్ని హరించి ధర్మస్థాపన గావించడానికి యదుకులాన వసుదేవ పుత్రునిగా అవతరించాను. నన్ను వాసుదేవుడంటారు. కంసనామంతో హింసారతుడై చెలరేగిన కాలనేమిని కడతేర్చాను. శిష్ట జనులకు కష్టాలు కలిగించే దుష్టదానవులను నామమాత్రావశిష్టులు గావిస్తున్నారు. ఓ దోషరహితా! నీ దృష్టి అనే అగ్గి సోకి బుగ్గిపాలైన వాడు రోషయుతుడైన కాలయవనుడు. నా అనన్య భక్తుడవైన నిన్ను అనుగ్రహించడానికి, ఓ భద్రపురుషా! నేను ఈ అద్రి (పర్వత) గుహకు వచ్చాను. రాజర్షీ! నీ కిష్టమైన వరాలు వేడుకో ఈడేరుస్తాను. నా భక్తులు ఎన్నటికీ శోక సంతప్తులు కారు.' శుకుడు– రాజా! హరి ఇలా ఆనతీయగా ముచుకుందుడు అతనిని కరివరదుడు, నరహరి– నారాయణునిగా ఎఱిగి నతి (నమస్కృతి) గావించి, ఇరువది ఎనిమిదవ మహాయుగంలో క్షితి– భూమిపై రమాపతి అచ్యుతుడు అవతరిస్తాడని మున్ను గర్గ మహాముని అన్న మాటను మతి– జ్ఞప్తికి తెచ్చుకొని ఇలా నుతించాడు...

**ఉ॥ 'పూనియనేక జన్మముల బొంది తుదిం దన పుణ్యకర్మ సం**
**తానము పేర్మి గర్మ వసుధా స్థలి బుట్టి ప్రపూర్ణ దేహుడై**
**మానవుడై గృహేచ్ఛ బడు మందు డజంబు తృణాభిలాషియై**
**కానక పోయి నూతబడు కైవడి నీ పదభక్తి హీనుడై'.**

ప్రభూ! ఎన్నో జన్మలెత్తి చివరికి తాను చేసుకొన్న పుణ్యకార్యాల ఫలంగా కర్మభూమిలో 'దేహే విద్యాధికారిణి'– ముక్తికి మూలకారణమైన బ్రహ్మజ్ఞాన ప్రాప్తికి అత్యంత అనుకూలమైన దేహం పొంది, పురుషుడై పుట్టి కూడా, గోవిందా! నీ పాదారవిందాల యందలి భక్తి లేక మూఢుడు దురాశాపరుడై, మేక గడ్డిమేత మీది ఆశతో కళ్లు కనిపించక, ఒళ్లు తెలియక, వెళ్లి వెళ్లి పెళ్లున నూతిలో పడినట్లు, గుడ్డివాడై 'గృహమంధకూపం'– ఇల్లనే చీకటి నూతిలో పడి చెడిపోతున్నాడు. కళత్ర పుత్ర ధనాదులు మరగి, మహారాజ్య వైభవంతో మదించిన మనస్సుగల వాడనై, ఈ మేను– దేహంపై పేరాస పెట్టుకొన్న నేను నిన్ను తెలుసుకోలేక చాలా కాలం వ్యర్థంగా గడిపాను.

**క॥ 'నరవర సంజ్జితమై రథ**
**కరి సేవితమైన యొడలు కాలగతిన్ భీ**
**కర మృగ భక్షితమై దు**
**స్తర విట్క్రిమి భస్మ సంజ్జితం బగునీశా!'**

'అభవా! ఈశా! 'ప్రభువు' అని పేరు వహించి, విభవంతో రథ గజాల మీద ఎక్కి తిరిగిన శరీరం కాలవశమై చిక్కి భీకర మృగాలచే భక్షింపబడితే పురీష– మలమనీ, మురిగి– కుళ్లిపోతే పురుగులనీ, కాలిపోతే భస్మం– బూది అనీ పిలువబడుతోంది. దిక్కులన్నీ జయించి, సాటివారు పెక్కురు కని కొనియాడుతుండగా ఉన్నత పీఠం– సింహాసనం, అందలం ఎక్కి కూర్చున్న చక్రవర్తి కూడా సుందరీమణులకు ఆటబొమ్మయి, మందిరాలలో మన్మథ సుఖాలు అనుభవిస్తాడే గాని తన డెందం– హృదయంలో నిన్ను అన్వేషించడు కదా!' ఈశ్వరా! మనసును బంధించి, మహిత– గొప్ప భోగాలను మాని, ఇంద్రియాల మదాన్ని అణచి, తపమాచరించి చివరికి అవర– తుచ్ఛమైన ఇంద్ర పదవిని ఆశిస్తాడే కాని ప్రవర– శ్రేష్ఠమైన నీ ఉపేంద్ర– అమృత స్థానాన్ని ఉపాసించడు.

**నీ॥ 'సంసారియై యున్న జనునకు నీశ్వర!,**
**నీ కృప యెప్పుడు నెఱయ గల్గు।**
**నప్పుడు బంధంబులన్నియు దెగిపోవు;**
**బంధ మోక్షంబైన బ్రాప్తమగును।**
**సత్సంగమంబు, సత్సంగమంబున నీదు,**
**భక్తి సిద్ధించు, నీ భక్తి వలన।**
**సన్ముక్తి యగు, నాకు సత్సంగమము కంటె,**
**మును రాజ్యబంధ నిర్మూలనంబు'**
**తే॥ 'గలిగినది దేవ! నీ యనుగ్రహము గాదె?**
**కృష్ణ! నీ సేవగాని తక్కినవి వలదు**
**ముక్తి సంధాయివగు నిన్ను ముట్ట గొలిచి**
**యాత్మ బంధంబు గోరునే యార్యుడెందు?'**

ఓ కంసారీ! నీ కృప కలిగినప్పుడే పురుషుడికి సంసార బంధాలు తొలగిపోతాయి. అప్పుడే సత్పురుషులతో సంబంధం– సాంగత్యం లభిస్తుంది. ఆ సత్సంగ మహిమ చే, దయాంతరంగా! నీ యందు భక్తి సిద్ధిస్తుంది. ఆ భక్తిచే ముక్తి చేకూరుతుంది. ఆర్య పూజ్యా! నాకు సత్సంగం కంటే ముందే రాజ్యబంధం తెగిపోయింది. దేవా! అది నీ అనుగ్రహ విశేషం! అందుకే, నీ సేవాభాగ్యమే కాని తక్కినవేమీ నాకు అక్కరలేదు. ముకుందా! ముక్తిని ప్రసాదించే నిన్ను సేవించి, విజ్ఞుడైన వాడెవడూ అద్దానికి (ముక్తికి) ప్రతిబంధకాలైన శబ్దాది విషయ భోగాలను వాంఛించడు గదా! కరుణావరుణాలయా! నేను నిన్ను శరణు వేడుతున్నా, బహుకాలంగా బాహాటంగా ప్రారబ్ధ కర్మఫలాలతో చాలా బాధలు పడుతూ, మరల ఆ పూర్వ వాసనలతోనే అపూర్వంగా పరితపిస్తూ, ఆశ విడువక పగవారైన ఆరు (పంచేంద్రియాలు, మనసు) ఇంద్రియాలను పోరులో గెలవలేని నాకు, ఓ వారిజాక్షా! నాకు శాంతి ఎలా లభిస్తుంది? ఆపన్నుడనైన నన్ను మన్నించి, అభయ సంపన్నుని గావించి రక్షించమంటూ వేడుకొన్న ముచుకుందుడితో ప్రపన్నార్తిహరుడు గోవిందుడు ప్రసన్నుడై ఇలా పలికాడు..

**ఉ॥ 'మంచిది నీదు బుద్ధి నృపమందన! నీవు పరార్థమెట్లు వ**
**ర్తించినినైన గోరికల దిక్కున జిక్కవు మేలు, నిర్మలో**
**దంచిత వృత్తినన్ గొలుచు ధన్యులబద్ధులు నెట్లు నీకు ని**
**శ్చంచల భక్తి గల్గెడిని సర్వము నేలుము మానవేటికిన్'**

'ఓ రాజకులైక భూషణా! నీ ధిషణ– బుద్ధి శుద్ధమైనది. నీవు పరుల కొరకు ఎలా ప్రవర్తించినా మితిలేని కోరికల ప్రలోభాలకు లోబడలేదు. నిర్మలమైన మతి కలిగి అనన్య భక్తితో నన్ను కొలుచు వారు ధన్యజీవులు. ప్రబుద్ధులు– మాయా నిద్ర నుంచి జాగృతులైన అట్టివారు– సిద్ధ పురుషులు సంసారబద్ధులు కారు. నరేంద్రా! నీకు నా యందు దృఢమైన భక్తిని అనుగ్రహిస్తున్నా. నాపై చిత్త– ధ్యాన ముంచి నిర్నిమిత్తంగా– కర్తవ్యబుద్ధితో సమస్తం పరిపాలించు. అమానీ! ఏదీ మానవలసిన పనిలేదు. మానవనాథా! పూర్వం నీవు క్షాత్రధర్మాన్ని అవలంబించి వేడుక కొరకు జంతువులను వేటాడి చంపావు. కాన, తపమాచరించి ఆ అపచారం వల్ల కలిగిన పాపాన్ని అపాకరించుకో– తొలగించుకో. తరువాతి జన్మలో 'మైత్రో బ్రాహ్మణ ఉచ్యతే'– సర్వప్రాణుల యందు మైత్రి– స్నేహం కలిగిన విప్రవరుడ– బ్రాహ్మణ శ్రేష్ఠుడవై, క్షిప్రం– శీఘ్రంగా నన్ను చేరుకోగలవు' అని వాసుదేవుడు ముచుకుందునికి వీడ్కోలు పలికాడు. ముచుకుందుడు మాధవునికి ప్రదక్షిణ ప్రణామాలు చేసి గుహ నుంచి బయటికి వచ్చాడు. అల్ప ప్రమాణాలతో ఉన్న మానవ, పశు, వృక్ష, లతాదులను గమనించి, కలియుగం రాబోతున్నదని గ్రహించి మహత్తరమైన ఉత్తర దిక్కునకు పయనమయ్యాడు. నర నారాయణులకు నిత్య నివాసమైన బదరికాశ్రమం చేరి తపోనిష్ఠుడై, శాంతుడై శ్రీకాంతుని సేవించసాగాడు. శుకుడు– రాజా! భువన సుందరుడు మధుసూదనుడు మథురా నగరానికి విచ్చేసి పట్టణాన్ని ముట్టడించి ఉన్న యవన సైన్యాన్ని కదన రంగంలో యమ సదనానికి పంపాడు. ఇలా మ్లేచ్ఛులను మట్టుపెట్టి మథురాపురిలోని సిరిసంపదలను ద్వారకా నగరికి తరలించే తరుణంలో జరాసంధుడు పదునెనిమిదవ సారి ఇరవై మూడు అక్షౌహిణీ సైన్యంతో మథురా నగరం మీద దండెత్తాడు. ఇది చూచి రామకృష్ణులు సంగ్రామ ప్రయత్నం మాని సామాన్య మానవుల మాదిరి, పిరికిపందల పగిది (వలె), జంకిన వారి తీరున, సిరి– విత్తమంతా అక్కడే విడిచి, పలాయనంలో తమ సత్తా చూపిస్తూ, పద్మాల వంటి మెత్తని పాదాలతో కారడవిలో పడి జోరుగా పరిగెత్తసాగారు. రామకృష్ణుల బల, ఐశ్వర్య మహిమల జ్ఞానం లేని జరాసంధుడు పారిపోతున్న వారిని చూచి పరిహసిస్తూ– 'నేను మిమ్ము విడువను. ఎక్కడ దాగినా వెంటపడి అంతమొందిస్తా' అంటూ సకల సేనలతో వారిని వెంబడించాడు. రామకృష్ణులు ఎన్నో ఆమడలు దూరంగా వెళ్లి 'ప్రవర్షణం' అను పేరు గల పెద్ద పర్వతాన్ని ఆరోహించారు. అమరేంద్రుడు అధికంగా వర్షం కురిపించడం వలన ఆ అద్రికి ఆ సార్థక నామం. గండరగండడు మాగధుడు రోషావేశంతో ఆ దొడ్డకొండ చుట్టూ దండు విడిశాడు. కాని, ఆ కొండకోనలో ఎక్కడా రామకృష్ణులను కనుగొనలేక వారి వినాశం కోరి, కట్టెలు పేర్చి ఆ గిరిని దగ్ధం చేయండని సైనికులను ఆదేశించాడు. వారు వెలిగించిన మహాగ్ని దరికొని– మండి ఆ గిరిని దహించి వేసింది. అప్పుడు పదకొండు యోజనాల పొడవైన ఆ కొండ శిఖరం నుంచి రామకృష్ణులు జరాసంధుని బలగాల కంటపడకుండా కుప్పించి బయటికి దూకి ద్వారకకు చేరుకున్నారు.

జరామరణాల నుంచి విముక్తి పొందాలని అందరూ కోరుకుంటారు. పుట్టి, తెలివి తెచ్చుకున్న తరువాత మనిషిని పట్టి పీడించే, ఎట్టి పరిష్కారానికీ– విరుగుడుకీ లొంగని గట్టి జగజెట్టి దుఃఖాలు ఈ రెండే! వ్యాధి వచ్చి చేరిన తరువాత నివారణ చర్యలకంటే శత విధాల అది ప్రవేశించకుండా నిరోధించడం మంచిది కదా! మరే మిటి ఉపాయం? అంటే 'జరామరణ మోక్షాయ మా మా శ్రిత్య యతన్తి యే' అని గీత సప్తమాధ్యాయం– 'జ్ఞానవిజ్ఞాన యోగం'లో– 'జరామరణ దుఃఖ విముక్తి కొరకు నన్నాశ్రయించి సాధన చెయ్యండి' అని భగవానుని ఉపదేశం. ఇది సిద్ధాంత వాక్యం. దీనికి భాగవతంలోని దృష్టాంతం.. జరాసంధ కాలయవనులు మానవ జీవితంలో వార్ధక్య మరణాలకు ప్రతీకలు. మథుర మానవ దేహానికి చిహ్నం. జరావస్థ– వృద్ధాప్యంలో ఇంద్రియాలన్నీ శిథిలావస్థకు చేరుకుంటాయి. కృష్ణ పరమాత్మ పదిహేడు పర్యాయాలు జరాసంధుని ఓడించి పంపాడు. కాని, వాడు పదునెనిమిదవసారి కాలయవనుని వెంటపెట్టుకు వచ్చాడు. విచిత్రంగా తన కంటె ముందుగా మథుర (శరీరం) మీదికి కాలం– మృత్యువునే ఉసికొల్పాడు. అనగా వృద్ధాప్య ఆగమనంతోనే మృత్యు భయం మొదలవుతుంది. జరామరణాలు రెండూ ఏకకాలంలో దాడిచేస్తే, ఎంతటి శక్తిమంతుని కైనా తట్టుకోవడం కష్టం. అప్పుడు భగవంతుడు చూపిన తిరుగులేని తరుణోపాయం ఏమిటి? ద్వారక అనే బ్రహ్మవిద్యను– భగవంతుని ఆశ్రయించడమే ఏకైక రక్షా కవచం. భగవంతుడు కూడా మథురను వదిలి 'ద్వారక'ను ఆశ్రయించాడు కదా! జరామరణాలు ద్వారకా దుర్గాన్ని ఛేదించలేవు. అనగా అవి బ్రహ్మనిష్ఠుని ఏమాత్రం బాధించలేవు.

తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

పరమాత్మ కాలయవనునికి దీర్ఘ నిద్రనిచ్చి భక్తుడైన ముచుకుందునికి మాయానిద్ర నుంచి జాగృతి– జాగరణ కలిగించాడు. స్వరూప సాక్షాత్కారం అనుగ్రహించాడు. జరాసంధుడు– వృద్ధాప్యం వెంటాడితే రామకృష్ణులు 'ప్రవర్షణ' పర్వతాన్ని అధిరోహించారు, ఆశ్రయించారు. ఎక్కడ నిరంతరంగా భక్తి జ్ఞానాల వృష్టి– వర్షం కురుస్తూ ఉంటుందో అదే ప్రవర్షణ గిరి. భగవల్లీలా కథావృష్టిలో తడవటమే భక్తులందరి తక్షణ కర్తవ్యం.

(సశేషం)

## ఆత్మశక్తి

క్రీస్తు సందేశం

క్రైస్తవ తత్వం ప్రకారం తండ్రి దేవుడు ఈ లోకానికి సృష్టికర్త. ఓ తనయునిగా వచ్చినవాడు క్రీస్తు. దుష్ట పూరితం అవుతున్న ఆ సృష్టి వినాశనాన్ని రక్షించడానికే ఆయన వచ్చాడని నమ్మకం. క్రీస్తు మోక్షారోహితుడైన తర్వాత.. 'ఈ లోకాన్ని నడిపించే శక్తి ఎవరూ?' అని ప్రశ్న వచ్చినపుడు, ఆ ఇద్దరితోనూ సరి సమానమైన ఆత్మే అని, అదే పవిత్రాత్మ శక్తి అని క్రైస్తవం నమ్ముతుంది. ఆత్మ పవిత్రాగ్ని రూపాన శిష్యులపైకి ఆవహిస్తుంది. క్రీస్తు బోధించిన సత్యాల్ని లోకానికి అందించడానికి వస్తుంది. అందుకు తనకు వాహికలుగా బోధనా వాచికలుగా అపోస్తులుల రూపంలో ప్రభు వాక్యాన్ని పరివ్యాప్తి చేస్తున్నది. ప్రస్తుతం ఈ లోకాన్ని నడిపించేది పవిత్రాత్మే అని క్రైస్తవ సోదరుల విశ్వాసం. ఈ శక్తులు ముప్పూరికీ (తండ్రి–తనయుడు– పరిశుద్ధాత్మ) భేదమన్నది లేదని సమ్యక్ సమైక్య త్రిత్వైక శక్తి అని నమ్ముతుంది. క్రీస్తు కూడా 'నా బోధనల్ని నా సత్యాన్ని సంపూర్ణం చేసేది ఆత్మశక్తే! అదే మిమ్మల్ని నడిపించే శక్తి' ప్రబోధించారు.

...✍ ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024

## సారం సందేశం

ఇస్లాం బోధ

ఎవరైనా ఇహలోకంలో కొంచెం దౌర్జన్యానికి పాల్పడినా.. పరలోకంలో అది పెద్ద శిక్షకు కారణమవుతుందని ఇస్లాం చెబుతుంది. దౌర్జన్యకారుల పాపం పండిన తర్వాత అల్లాహ్ వారిని శిక్షించకుండా వదలిపెట్టరు. అందుకే ప్రభుత్వ ఉద్యోగులు జకాత్ వసూళ్లలో దౌర్జన్యానికి పాల్పడకూడదు. దేవుడి ఖజానాను (ప్రజాధనాన్ని) అక్రమంగా ఖర్చు పెట్టినవారు ప్రళయ దినాన నరకాగ్నిలో పడి హాహాకారాలు చేయాల్సి వస్తుంది. దుర్మార్గమైన పనుల్లో పిసినారితనం ముఖ్యమైనది. మితిమీరిన ధన వ్యామోహంతో ఉన్నవాడు లేనివాడిని దోచుకుంటున్నాడు. అయితే లేనివారికి దైవం అండగా నిలుస్తారని దైవ ప్రవక్త (సల్లం) భరోసా ఇచ్చారు. వారికి జరిగిన నష్టాన్ని దైవం తిరిగి చెల్లిస్తారని తెలిపారు. 'ప్రళయదినాన ఆఖరికి కొమ్ములేని మేకకు కూడా కొమ్ములున్న మేక నుంచి పరిహారం ఇప్పించబడుతుంది' అని దైవ ప్రవక్త (సల్లం) ప్రవచించారు. ముస్లింలు అవిశ్వాసులు కాకూడదని... తమలో తాము ఒకరినొకరు చంపుకోవడం మహా పాపమని ఆయన తెలిపారు. తోటి ముస్లింల ధన, మాన ప్రాణాలను పరిరక్షించాలని ఆదేశించారు. తన నోటితో కాని, చేత్తో కాని ఇతర ముస్లింలకు బాధ కలగకుండా మసలుకునేవాడే నిజమైన ముస్లిం అని ప్రవచించారు. హిజ్రత్ (దైవ మార్గంలో పయనించేవారు) ఉన్నవారు దైవం పట్ల అవిధేయతను విడనాడాలని హితవు పలికారు.

...✍ ముహమ్మద్ ముజాహిద్, 96406 22076